బీసీల ఆమరణదీక్షపై సర్కారు చిన్నచూపు

- పది రోజులవుతున్నా పలకరించని ప్రభుత్వం
- పత్తాలేని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అన్నిపార్టీలు, సంఘాలు నుంచి మద్దతు

ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని పరామర్శిస్తున్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, జూలూరు గౌరీశంకర్, పాశం యాదగిరి

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్‌పేట్ : కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ మేరకు రాష్ట్రంలో సమగ్ర కులగణనను తక్షణమే చేపట్టాలని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ నేతలు చేపట్టిన ఆమరణదీక్షపై కాంగ్రెస్ సర్కారు కనికరించని పరిస్థితి కనిపిస్తున్నది. దీక్షాపరుల ఆరోగ్యం క్షీణిస్తున్నా లెక్కచేయని దుస్థితి నెలకొన్నది.

కొనసాగుతున్న దీక్షలు..

బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు భక్తుల సిద్దేశ్వర్, రజక సంఘం నాయకుడు చాపర్తి కుమార్‌గాడ్గే గత నెల 23 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. హామీలపై స్పష్టతనివ్వని సర్కారు దీక్షను భగ్నం చేసేందుకు పూనుకున్నది. దీక్ష చేపట్టిన నేతలను అరెస్టు చేసింది. కుమార్‌గాడ్గేను హన్మకొండ జిల్లా మడికొండకు తరలించింది. అనంతరం ఎంజీఎంలో చేర్చగా, కుమార్‌గాడ్గే వైద్యశాలలోనే దీక్ష కొనసాగిస్తున్నారు. సిద్దేశ్వర్, సంజయ్‌ను అరెస్టు చేసి గాంధీ దవాఖానలో చేర్పించింది. వారు అక్కడే దీక్షను కొనసాగిస్తున్నారు. సంజయ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించింది.

వెల్లువెత్తిన మద్దతు..

దీక్షాపరులకు బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ సంఘీభావం తెలిపారు. బీఆర్‌నేత సీనియర్ నేత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి బీసీ నేతలకు మద్దతు ప్రకటించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్, బీసీ ఫ్రంట్ చైర్మన్ గౌరిగె మల్లేశ్, సీపీఎం, పలు సంఘాలు మద్దతు తెలిపాయి. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని గాంధీదవాఖానకు వెళ్లి దీక్షాపరులను పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీ హనుమంతరావు సైతం దీక్షకు మద్దతు ప్రకటించారు. గాంధీ దవాఖానలో దీక్ష చేస్తున్న సిద్దేశ్వర్‌ను సోమవారం బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, సోషల్ జస్టిస్ పార్టీ ఇన్‌చార్జి కేవీ గౌడ్, బీసీ ఆజాది సంఘ్ అధ్యక్షుడు డీ మహేశ్‌గౌడ్, అంబేద్కర్ అజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి పరామర్శించి సంఘీభావం తెలిపారు. కాచిగూడలో దీక్ష చేస్తున్న సంజయ్‌ను జర్నలుస్టులు పాశం యాదగిరి, జూలూరు గౌరీశంకర్ పరామర్శించారు.

పత్తాలేని బీసీ సంక్షేమ శాఖ మంత్రి

బీసీ నేతల దీక్షకు అన్నివర్గాల నుంచి మద్దతు లభిస్తున్నా కాంగ్రెస్ సర్కారు మాత్రం ఏమాత్రం లెక్కచేయని దుస్థితి నెలకొన్నది. ఇప్పటివరకు ప్రభుత్వ పెద్దలు స్పందించలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కనీసం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం ఇప్పటివరకు దీక్షపై స్పందించకపోవడంతో బీసీ వర్గాలు మండిపడుతున్నాయి.

ఇక సర్కారుతో యుద్ధమే

సమగ్ర కులగణన, రిజర్వేషన్ల పెంపు అంశంపై ప్రభుత్వం తక్షణం స్పందించాలి. బీసీ నేతల దీక్షపై ఇప్పటివరకు స్పందించకపోవడం కాంగ్రెస్ బీసీ వ్యతిరేక వైఖరికి నిదర్శనం. అన్నివర్గాల ప్రజలను మోసం చేసినట్టు బీసీలను మోసం చేస్తే కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి తప్పదు. ఇక కాంగ్రెస్ సర్కారుపై బీసీల యుద్ధం మొదలైంది. హామీలు అమలయ్యే వరకు విశ్రమించేది లేదు. -రాజారాంయాదవ్, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు

అభివృద్ధిలో కేసీఆర్ ఆదర్శం

ఎక్స్‌లో మేధావుల మధ్య చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి అంశంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అనుసరించిన విధానాలు, పరిపాలన విధానాలు ఆదర్శనీయమని, అవే తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపాయని సోషల్‌మీడియాలో ఆర్థికవేత్తలు, మేధావుల మధ్య ఆసక్తికర చర్చ కొనసాగుతున్నది. ఎక్స్ వేదికగా ముత్తుకృష్ణన్ అనే ఆర్థికవేత్త '2014 నుంచి 2023 వరకు తెలంగాణ సాధించిన అభివృద్ధిని భారతదేశంలోని మరే రాష్ట్రం సాధించలేదు. ఇది నా స్వంత పరిశోధనల నుంచి తెలుసుకున్నది. కేసీఆర్ గత దశాబ్దకాలంగా తెలంగాణకు ఆర్థికంగా, సామాజికంగా అద్భుతమైన అభివృద్ధిని చేశారని నా పరిశోధనతో నేను నిర్ధారించాను. అయినప్పటికీ తెలంగాణ ప్రజలు ఎందుకు అలా తిరస్కరించారో నాకు తెలియడం లేదు' అని అభిప్రాయం వ్యక్తం చేశారు. దానిపై మరో ఆర్థిక, సామాజికవేత్త అర్విందా వారియర్ స్పందిస్తూ 'నేను 2021లో భారతదేశంలోని వివిధ రాష్ట్రాల అభివృద్ధి నమూనాను పరిశోధించడం ప్రారంభించాను. 2014 నుంచి 2023 వరకు తెలంగాణ ప్రభుత్వం సాధించిన భారీ విజయాలను చూసి ఆశ్చర్యపోయా' అని వెల్లడించారు. వారిద్దరే కాదు ఆ పోస్టుపై అనేక మంది మేధావులు తెలంగాణ అభివృద్ధిపై పోస్టులు పెడుతూ తమ పరిశోధనలు, అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు.

ఉన్నత పదవుల్లో ఉన్నవారు సంయమనం పాటించాలి

- సీఎం రేవంత్‌పై సుప్రీంకోర్టు అసహనం
- ఓటుకు నోటు కేసు రెండువారాలకు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఉన్నత పదవుల్లో ఉన్నవారు కొంత సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. గత నెల 29న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరైన సందర్భంగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి.. తన వ్యాఖ్యలను వక్రీకరించారని పేర్కొంటూ ఎక్స్ వేదికగా సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణ చెప్పారు. న్యాయస్థానాల పట్ల తనకెంతో గౌరవమని, దేశ న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసమున్నదని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసు విచారణ సందర్భంగా ఈ అంశం సోమవారం మరోసారి ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కోర్టులు, న్యాయవ్యవస్థ పట్ల సామాజిక మాధ్యమాల్లో అనుచితంగా వ్యవహరిస్తున్నారని.. ఇందుకు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అని తెలిపారు. దీనిపై ఒక ఐఏ (ఇంటర్ లాక్యుటరీ అప్లికేషన్) దాఖలు చేశామని పేర్కొన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తుల ఫొటోలు పెట్టి ఇష్టారీతిలో సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆ వివరాలు అన్ని ఐఏలో పొందుపరిచినట్టు వివరించారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ స్పందిస్తూ.. ఉన్నత పదవుల్లో ఉన్నవారి నుంచి కొంత సంయమని ఆశిస్తామని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు కోర్టులను, లాయర్లను ఇందులోకి లాగుతున్నారు అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం హోంమంత్రిత్వశాఖ కూడాసీఎం రేవంత్ వద్దనే ఉన్నదని, ఓటుకు నోటు కేసును ముందుకు తీసుకెళ్లాల్సిన అధికారులు ప్రతిరోజు ఆయనకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పిటిషనర్ తరపు న్యాయవాదులు వివరించారు. ఒకవేళ మరోచోటుకు మార్చినా అధికారులు ఆయనకు చెప్పిన తర్వాతే కోర్టుకు వెళతారు కదా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అప్పుడు కోర్టు అధికార పరిధి (జ్యూరిస్‌డిక్షన్) మారుతుందని న్యాయవాదులు వివరించారు. విచారించే కోర్టు మారినా.. పరిధి మారదు, విషయం మరదని న్యాయమూర్తులు తెలిపారు. ఇప్పటికే 25 మంది సాక్షుల నుంచి అన్ని వివరాలు నమోదు చేసినట్టు తెలంగాణ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. పిటిషనర్లు దాఖలు చేసిన ఐఏకు తమ సమాధానాలు ఇవ్వాలని ప్రతివాదులను ఆశించిన ధర్మాసనం ఓటుకు నోటు కేసు బదిలీ పిటిషన్‌పై విచారణను మరో రెండు వారాల పాటు వాయిదా వేసింది.

మాజీ సర్పంచ్‌ల బకాయిలు చెల్లించాలి

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మాజీ సర్పంచ్‌లకు బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. వారంలో ఇవ్వకుంటే ఇందిరా పార్క్ వద్ద నిరసన చేపడుతామని ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ చైర్మన్ యాదయ్య, కార్యదర్శి రాజేందర్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు కావస్తునాన మాజీ సర్పంచ్‌ల పరిస్థితి దారుణంగా తయారైందని ఆందోళన వ్యక్తంచేశారు. రూ.1300 కోట్ల బకాయిలు పెండింగ్ ఉన్నాయని, కేంద్రం నుంచి వచ్చిన రూ.600 కోట్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే అమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

48 గంటల్లో రూట్‌మ్యాప్ ప్రకటించాలి

- లేకుంటే లక్షల మందితో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్
- హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద బీసీ నాయకుల ధర్నా

హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 2: కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం 48 గంటల్లో రూట్ మ్యాప్ ప్రకటించాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తక్షణమే కులగణనకు చర్యలు చేపట్టాలని, లేకుంటే రాస్తా, రైల్‌రోకోలు, మంత్రుల నివాసాల ముట్టడితోపాటు హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని, రాష్ట్ర బంద్‌కు కూడా వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలరాజు గౌడ్, వేముల వెంకటేశ్, మణిమంజరి, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నగేశ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం, నాయకులు

వైఎస్ సేవలు చిరస్మరణీయం: పొన్నం

హుస్నాబాద్, సెప్టెంబర్ 2: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన కొనసాగిస్తూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నామని చెప్పారు. లింగమూర్తి, వల్లపు రాజు, సరోజన, చిత్తారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

రంగసముద్రానికి జలకళ

'నమస్తే తెలంగాణ'కు గిరికొత్తపల్లి రైతుల కృతజ్ఞతలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/మాడ్గుల : రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గిరికొత్తపల్లిలోని చారిత్రక రంగసముద్రం చెరువుకు మోక్షం లభించింది. రియల్టర్ల చెర వీడటంతో జలకళ సంతరించుకుంటున్నది. 400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు భూగర్భజలాల పెంపునకు నెలవైన ఈ చెరువు రియల్ వలలో చిక్కుకుని బీడువారిపోయింది. ఈ ఏడాది జనవరిలో గ్రామ రైతులు 'నమస్తే తెలంగాణ'ను ఆశ్రయించి చెరువును రక్షించాలని కోరాగా.. 'రియల్ వలలో రంగ సముద్రం విలవిల' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు మే నెలలో కత్వ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. రూ.5 లక్షలతో మరమ్మతులు చేయడంతోపాటు చెరువు వరకు కాల్వను పునరుద్ధరించారు. చెరువుకట్ట పటిష్టానికి రూ.16 లక్షలతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పెద్దవాగు ద్వారా చెరువులోకి నీరు చేరుతుంది. దీంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఏండ్ల తర్వాత చెరువులో జలకళ చూస్తున్నామని 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణాలు పోయినా ఫార్మాసిటీకి భూమివ్వం

- సంగారెడ్డి జిల్లాలో అధికారులను అడ్డుకున్న బాధితులు
- పచ్చని పొలాల్లో 'ఫార్మా' పాగాను సహించబోమని స్పష్టం

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్-మల్గి గ్రామాల శివారులో అధికారుల వాహనాలను అడ్డుకుంటున్న ఫార్మాసిటీ భూబాధితులు, ప్రజలు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 2: జీవనాధారమైన పచ్చని పంటపొలాలను తీసుకుని.. తీవ్రమైన నష్టం చేకూర్చే ఫార్మాసిటీ ఏర్పాటుకు తమ ప్రాణాలు పోయినా సరే భూములను ఇచ్చేది లేదని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాల ప్రజలు తేల్చిచెప్పారు. ఆయా గ్రామాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు సేకరించే భూములను పరిశీలించేందుకు సోమవారం వచ్చిన జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ డిప్యూటీ కలెక్టర్ మాధురి, జహీరాబాద్ ఆర్డీవో రాజును డప్పూర్-మల్గి గ్రామాల శివారులో స్థానికులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, భూబాధితులు మాట్లాడుతూ.. తమ గ్రామాల పరిధిలో 2 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గుట్టుచప్పుడు కాకుండా అధికారులు సర్వే చేసి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సాగు భూములు తీసుకొని తమను రోడ్డు పాలు చేయొద్దని, ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు నాలుగు గంటల వరకు అధికారులను కదలనివ్వకుండా వాహనాలకు అడ్డుగా నిలిచారు. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి అధికారులెవరూ వెళ్లేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. అనంతరం జిల్లా రెవెన్యూ డిప్యూటీ కలెక్టర్ మాధురి, జహీరాబాద్ ఆర్డీవో రాజుకు భూబాధితులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇకపై అధికారులెవరైనా తమ గ్రామాలకు వచ్చేముందు సమాచారం ఇవ్వాలని, గుట్టుచప్పుడు కాకుండా వస్తే సహించేదిలేదని స్పష్టంచేశారు.

పచ్చని పొలాలపై 'ఫార్మా' పాగా తగదు

ఇప్పటికే న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో నిమ్జ్ ఏర్పాటుకు ఈ ప్రాంత రైతుల నుంచి 12,635 ఎకరాల భూమి సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మొదటి విడతలో 3,600 ఎకరాలు సేకరించారు. ఇప్పుడు ఫార్మాసిటీ కోసం న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో 2,003 ఎకరాల భూసేకరణ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగానూ న్యాల్‌కల్ మండలం డప్పూర్ గ్రామ శివారులో 1465.25 ఎకరాలు, మల్గిలో 282.13 ఎకరాలు, వడ్డిలో 256 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సర్వే చేసిన సంబంధిత జిల్లా అధికారులు.. ప్రభుత్వానికి నివేదికలను పంపించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో భూసేకరణ చేపట్టేందుకు సంబంధిత జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై గెజిట్ నోటిఫికేషన్ జీవో పత్రాలను అతికించారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో ఆయా గ్రామాల శివారులోని గుట్టలపై నవనాథ్ సిద్ధ లింగేశ్వరస్వామి, మల్లన్నస్వామి, ఫీర్‌గైబ్ సాహెబ్ దర్గాలను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సైతం ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. భూములు కోల్పోవడంతో తాము రోడ్డున పడటంతోపాటు అన్ని విధాలుగా నష్టం జరుగుతుందని వాపోతున్నారు.

హద్నూర్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ఫార్మాసిటీ (విలేజ్) కోసం చేపట్టే భూసేకరణకు అధికారులు ముందుస్తు సమాచారం లేకుండా గ్రామాల్లోకి రావొద్దంటూ వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాలకు చెందిన నాయకులు, భూబాధితులు సోమవారం రాత్రి హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సై రామానాయుడుకు ఫిర్యాదు చేశారు. ఫార్మాసిటీ కోసం బలవంత భూసేకరణ తగదని, ముందస్తు సమాచారం లేకుండా గ్రామాలకు వచ్చే సమయంలో జరిగే పరిణామాలకు తమను బాధ్యులు చేయొద్దని చెప్పారు. ముందుగా సమాచారం ఇస్తే అధికారులకు సహకరిస్తామని తెలిపారు.

సామాజిక, ఆహార అలవాట్లతో

పోషకాహార లోపానికి చెక్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): సామాజిక, ఆహార అలవాట్లతోనే పోషకాహార లోపాన్ని నివారించవచ్చని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. జాతీయ పోషకాహార మాసోత్సవం సందర్భంగా 'అందరికీ పోషకాహారం' అనే అంశంపై హైదరాబాద్‌లోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో 5 రోజులపాటు కేంద్ర సమాచార సంస్థ నిర్వహిస్తున్న అవగాహన సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ.. భిన్న సంస్కృతులు, భాషలతో కూడిన మన దేశంలో ప్రజలందరికీ పోషకాహార సమాచారాన్ని చేరవేయడం సవాలేనని పేర్కొన్నారు. సృజనాత్మక వ్యూహాలతో ఈ సవాలును అధిగమించడమే పోషణ్ అభియాన్ లక్ష్యమని చెప్పారు. సదస్సులో తాజా ఆహార మార్గదర్శకాలు, స్థూల-సూక్ష్మ పోషకాల ప్రాధాన్యం, ఆహారంలో పోషకాలను గుర్తించే విధానాలపై ఫొటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్, తెలంగాణ మహిళా వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ ఎమ్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్థుల అరెస్ట్

- చెక్‌బుక్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులు స్వాధీనం
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, సెప్టెంబర్ 2 : ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని ప్రజలను నమ్మించి దేశవ్యాప్తంగా రూ.కోట్లు కొల్లగొట్టిన ఇద్దరు సైబర్ నేరస్థులను వరంగల్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సీపీ అంబర్‌కిశోర్ ఝా కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం కాంచిపురానికి చెందిన జసిల్, ప్రీతి కలిసి గోల్డ్‌మ్యాన్ సచ్, యామ్-బ్రాండింగ్స్ నకిలీ వెబ్‌సైట్ ద్వారా తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభం వస్తుందని ప్రజలను నమ్మించి రూ.కోట్లు వసూలు చేశారు. తెలంగాణలోనే 15 నేరాల్లో 3 కోట్లు కొల్లగొట్టారు. హనుమకొండకు చెందిన ఓ వ్యక్తి రూ.28 లక్షలు ఇన్వెస్ట్ చేసి మోసపోయినట్టు గుర్తించి వెంటనే వరంగల్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చెన్నైలోని సలయూరులో జసిల్, ప్రీతి జంటను అదుపులోకి తీసుకున్నారు. ఈ జంట మొత్తం 150 కేసుల్లో కోట్ల వసూళ్లకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలినట్టు సీపీ తెలిపారు. నిందితులు వినియోగించిన బ్యాంకు ఖాతాలు సీజ్ చేసి, చెక్ బుక్కులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, పెన్ డ్రైవ్ స్వాధీనం చేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సూరం చెరువుపై సర్వే

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/మహేశ్వరం: సూరం చెరువు కబ్జాపై 'నమస్తే తెలంగాణ'లో కథనం రావడంతో నీటిపారుదలశాఖ ఇంజినీర్లు సోమవారం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఎస్ఈ హైదర్‌ఖాన్ సహా డీఈఈ, ఏఈఈ, మహేశ్వరం తహసీల్దార్ సైదులు సూరం చెరువును పరిశీలించారు. త్వరలో సర్వే చేయించి నివేదిక రూపొందిస్తామని ఇంజినీర్లు తెలిపారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఎగువన ఉన్న కొత్తకుంటను మాత్రం నీటిపారుదలశాఖ ఇంజినీర్లు విస్మరించడం అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది. పత్రికలో వచ్చినందుకు మాత్రమే సూరం చెరువును పరిశీలించారా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ బాధ్యతగా కబ్జాకు గురైన నీటి వనరులను పరిశీలించి, చర్యలు తీసుకోవాల్సింది పోయి కంటి తుడుపు చర్యగా సూరం చెరువును పరిశీలించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్‌ఆర్‌ఆర్ కోసమే ప్రపంచ బ్యాంకుకు!

మొదటిపేజీ తరువాయి...

ఎదురవుతుండగా, భూసేకరణ పూర్తయ్యాక టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ప్రాజెక్టు మంజూరై మూడున్నరేండ్లు పూర్తవుతున్నా ఇంతవరకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. కేంద్రం నుంచి, జాతీయ రహదారుల శాఖ సరైన సహకారం లభించటం లేదు. నష్ట పరిహారం పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనలను కేంద్రం పట్టించుకోలేదు. దీంతో ఉత్తర భాగం టెండర్ల ప్రక్రియలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో తాము అధికారంలో ఉండగానే ఆర్‌ఆర్‌ఆర్‌ను పూర్తి చేయాలని కృతనిశ్చయంతో ఉన్న సీఎం.. దక్షిణ భాగం పనులను ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంతో పీపీపీ విధానంలో చేపట్టాలని నిర్ణయించారు. భూసేకరణ సహా రోడ్డు నిర్మాణానికి రూ.15,000 కోట్లకు కాస్త అటుఇటుగా ఖర్చవుతుందని, నాలుగు టోల్ ప్లాజాలను ఏర్పాటుచేసి 20-25 ఏండ్ల పాటు టోల్ వసూళ్ల ద్వారా పెట్టిన పెట్టుబడి రాబట్టుకోవచ్చని అంచనా వేశారు.

ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ

సీఎం సూచనల ప్రకారం రోడ్డు నిర్మాణంలో సాధ్యమైనంత తక్కువగా ప్రైవేటు భూములు ప్రభావితం అయ్యేలా, ప్రభుత్వ భూములు, అటవీ భూములు ఎక్కువగా ఉపయోగించుకునేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఇప్పటికే ఉన్న రోడ్లను విస్తరిస్తూ సాధ్యమైనంత తక్కువగా ప్రైవేటు భూములు ప్రభావితమయ్యేలా అలైన్‌మెంట్ ఖరారుచేశారు. ముచ్చర్ల ప్రాంతంలో భారీ జంక్షన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని దృష్టిలో ఉంచుకొని రేడియల్ రోడ్లు వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటు భూములు ప్రభావితం అవుతున్న ప్రాంతాల్లో ల్యాండ్‌పూలింగ్ పద్ధతిలో భూములు సేకరించాలని, భూములు కోల్పోతున్న రైతులకు అక్కడే అభివృద్ధి చేసిన భూమిని ప్లాట్ల రూపంలో కేటాయించి.. వాటి అభివృద్ధికి అవసరమైన డెవలప్‌మెంట్ రైట్స్ కూడా ఇవ్వాలని తెలిపారు. దీంతో రైతులు కోల్పోతున్న భూములకు సరైన న్యాయం లభిస్తుందని, రైతులు కూడా ఇందుకు సంతోషంగా ముందుకు వస్తారని ప్రభుత్వం భావిస్తున్నది. ఖరారైన అలైన్‌మెంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారుల బృందాలను పంపారు. హెచ్ఎండీఏ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, నీటి పారుదల, ఆర్అండ్‌బీ, టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు భూముల సేకరణలో క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నదా? రైతులు ఏం కోరుకుంటున్నారు? వారికి నష్టం జరుగకుండా ఏం చేయాలి? తదితర అంశాలను అధ్యయనం చేసి రైతులు కోరుతున్న అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. రైతుల నుంచి ఎటువంటి వ్యతిరేకత వ్యక్తంకాకుండా వారు కోరుకున్నట్టు డెవలప్‌మెంట్ రైట్స్ కల్పించాలని నిర్ణయించారు.

తమ ఆధ్వర్యంలోనే పూర్తిచేయాలని..

ఫ్యూచర్ సిటీ పరిధిలోనే ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం కూడా ఉన్నది. తన హయాంలో ఏదో ఒక్కటైనా భారీ ప్రాజెక్టు పూర్తిచేయాలని సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు. ఇందులో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం పనులను వెంటనే ప్రారంభించి సాధ్యమైనంత తొందరగా పూర్తిచేయాలని నిర్ణయించారు. ఉత్తర భాగం మంజూరు చేసిన మూడున్నరేండ్లకు కూడా ఇంకా టెండర్ల ప్రక్రియ మొదలు కాలేదు. ఇదే పద్ధతిలో ముందుకుపోతే దక్షిణ భాగానికి ఎన్నేండ్లు పడుతుందో తెలియదు. పైగా, కేంద్రం ఆధ్వర్యంలో చేపడితే రాష్ట్ర ప్రభుత్వ పాత్ర పెద్దగా ఉండదు. శంకుస్థాపన కార్యక్రమానికి తమ పార్టీ పెద్దలను ఆహ్వానించే అవకాశం ఉండదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మించటం ఉత్తమమనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి-ఆమన్‌గల్-షాద్‌నగర్-చౌటుప్పల్ ప్రాంతాలగుండా సాగనున్నది.